## క్లుప్తంగా

### 20న ఉచిత నేత్ర వైద్య శిబిరం

**తాళ్లరేవు:** ఈ నెల 20వ తేదీన ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్రీమ్ సేవా సంస్థ డైరెక్టర్ దొమ్మేటి వసంతరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రమైన తాళ్లరేవు హైస్కూల్ పక్కన గల బాప్టిస్టు చర్చి ప్రాంగణంలో 20న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఈ శిబిరం జరుగుతుందన్నారు. శిబిరంలో పిఠాపురం సీఎంసీ ఆస్పత్రి వైద్యులచే ఉచిత నేత్ర పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందుల పంపిణీ చేస్తామన్నారు. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ఘనంగా పాదాలమ్మ తల్లి జాతర

**తాళ్లరేవు:** మండల పరిధిలోని జి.వేమవరం గ్రామదేవత పాదాలమ్మ తల్లి జాతర గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు సమర్పించుకున్నారు. బుధవారం అమ్మవారి తీర్థం నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

### వీరేశ్వరునికి లక్ష బిల్వార్చన



వీరేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన చేస్తున్న ఆలయ పండితుడు

**ఐ.పోలవరం:** ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో వీరేశ్వరునికి లక్ష బిల్వార్చన ఘనంగా జరిగింది. ఆలయ పండితులు నాగాభట్ల రామకృష్ణ మూర్తి ఆధ్వర్యంలో మంగళవారం పలువురు పండితులచే స్వామివారికి గణపతి పూజ, పుణ్యాహవచనం, ఏకాదశ రుద్రాభిషేకం, మారేడు దళాలతో బిల్వార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

### నేడు దళిత వేదన సంపుటి ఆవిష్కరణ

**యానాం:** కొల్లు వెంకన్న మాస్టారు దళిత వేదన పేరుతో రాసిన పద్య, గద్య, వచన, గేయ సంపుటిని బుధవారం ఆవిష్కరించనున్నట్లు నిర్వాహకుడు సత్యనారాయణ మంగళవారం తెలిపారు. స్థానిక సర్కిల్ ది యానాం భవనంలో కలైమామణి, ప్రముఖ కవి దాట్ల దేవదానంరాజు అధ్యక్షతన ఉదయం 9 గంటలకు జరిగే కార్యక్రమానికి దక్షిణ భారత దళిత సాహిత్య అకాడమీ అధ్యక్షుడు పొనుగుమట్ల విష్ణుమూర్తి, రిటైర్డ్ ఇంజినీర్ వినకోటి శ్రీరామచంద్రమూర్తి, రిటైర్డ్ ఆర్ఏఓ నామాడి అప్పారావు, పిల్లి రాంబాబు, గుత్తాల శ్రీరాములు, భూషణం, కేవీవీ సత్యనారాయణ, కుంచే సూర్యనారాయణ తదితరులు హాజరవుతారన్నారు.

### ఘనంగా పోలేరమ్మ జాతర



సమనస పోలేరమ్మ తల్లి

**అమలాపురం రూరల్:** మండలంలోని సమనస గ్రామ దేవతగా పేరొందుతున్న పోలేరమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం రాత్రి అమ్మవారి సంబరం, జాతర నిర్వహించారు. అమ్మవారిని మంగళవారం గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం భారీ అన్న సమారాధన, తీర్థం నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

### నాలుగు రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తి

**యానాం:** నియోజకవర్గ పరిధిలో లోక్‌సభ ఎన్నికకు సంబంధించి ఓట్ల లెక్కింపు నాలుగు రౌండ్లలో పూర్తి చేశారు. మొదటి రౌండ్‌లో బీజేపీ, ఎన్ఆర్‌కాంగ్రెస్ కూటమి అభ్యర్థి ఎ.నమశ్శివాయంకు 6,996 ఓట్లు, రెండో రౌండ్‌లో 6,848 ఓట్లు, మూడో‌రౌండ్‌లో 6,115 ఓట్లు, నాలుగో రౌండ్‌లో 2,168 ఓట్లు లభించాయి. కాంగ్రెస్(ఇండియా కూటమి) అభ్యర్థి వి.వైథిలింగంకు మొదటి రౌండ్‌లో 1,950, రెండో రౌండ్‌లో 1,873, మూడో రౌండ్‌లో 2,750, నాలుగో రౌండ్‌లో 374 ఓట్లు లభించాయి.

### రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి 'పాలిక' మృతి

**రాజోలు:** రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి పాలిక శ్రీనివాసబాబు (64) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. చింతలపల్లి గ్రామానికి చెందిన పాలిక శ్రీనివాసబాబు రాజోలు మండలంలోని తాటిపాక, శివకోడు, చింతలపల్లి గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ఇటీవల ఆయన రాజోలులో ఫోర్‌షోస్ థియేటర్‌ను నిర్మించారు. కొన్నేళ్ల పాటు ఆయన ఉదయం, వార్త తదితర ప్రముఖ పత్రికల్లో జర్నలిస్టుగా పని చేసి అనేక సామాజిక సమస్యలపై పోరాటం చేశారు. ఆయన మృతికి మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, ఎంపీపీ కేతా శ్రీనివాస్, సర్పంచ్ రేవు జ్యోతి, ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీ ఈశ్వరి, కొపనాతి పుష్పలత తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

# అమలాపురం విజేత ఆనందరావు




ఆర్డీవో కేశవవర్ధనరెడ్డి చేతుల మీదుగా ఎన్నిక ధ్రువపత్రం అందుకుంటున్న అయితాబత్తుల ఆనందరావు

- సమీప ప్రత్యర్థి విశ్వరూప్‌పై 37,832 ఓట్ల ఆధిక్యంతో గెలుపు
- నోటాకు ఓటేసిన 2,133 మంది ఓటర్లు

**అమలాపురం టౌన్:** గత నెల 13వ తేదీన జరిగిన ఎన్నికలకు సంబంధించి మంగళవారం కాట్రేనికోన మండలం చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు జరిగింది. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి పినిపే విశ్వరూప్‌పై టీడీపీ అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు 37,832 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. నియోజకవర్గ బరిలో మొత్తం 13 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. అయితాబత్తుల ఆనందరావు 1,02,426 ఓట్లు సాధిస్తే విశ్వరూప్‌కు 64,594 ఓట్లు వచ్చాయి. బహుజన సమాజ్‌వాది పార్టీ నుంచి పోటీ చేసిన పాలమూరి మోహనబాబుకు 1971 ఓట్లు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అయితాబత్తుల సుభాషిణికి 1,327 ఓట్లు, లోక్ తాంత్రిక జనతాదళ్ అభ్యర్థి జంగా రాజేంద్రకుమార్‌కు 795 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి పరమట శ్యామ్‌కుమార్‌కు 793 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి చిట్టుగుళ్ల వీర వెంకట సత్యనారాయణకు 315 ఓట్లు, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థి అయితాబత్తుల అభిమన్యుడికి 279 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి వరసాల సత్యనారాయణకు 144 ఓట్లు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అయితాబత్తుల ఆనందబాబుకు 125 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి బీర రామారావుకు 100 ఓట్లు, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఐశ్వర్య బొజ్జాకు 98 ఓట్లు, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి దేవరపల్లి రాజీవ్‌కు 90 ఓట్లు వచ్చాయి. 2,133 మంది ఓటర్లు నోటాకు ఓట్లేసి తమ అయిష్టతను చాటారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లపరంగా నియోజకవర్గంలో 2,498 ఓట్లు ఉన్నాయి. అందులో టీడీపీ అభ్యర్థి ఆనందరావుకు 782 ఓట్ల ఆధిక్యత వచ్చింది. ఆనందరావుకు 1571 ఓట్లు, మంత్రి విశ్వరూప్‌కు 789 ఓట్లు వచ్చాయి. 130 ఓట్లు ఇన్‌వ్యాలిడ్ అయ్యాయి. ఎన్నికల్లో విజయం సాధించిన ఆనందరావుకు నియోజకవర్గ ఆర్వో, అమలాపురం ఆర్డీవో కేశవవర్ధనరెడ్డి ధ్రువీకరణ పత్రం అందజేశారు.

## ముమ్మిడివరంలో బుచ్చిబాబు విజయం



రిటర్నింగ్ అధికారి వి.మదన్‌మోహన్ నుంచి ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న దాట్ల సుబ్బరాజు

**ముమ్మిడివరం:** ముమ్మిడివరం అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి దాట్ల సుబ్బరాజు 37,935 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. తొలి రౌండు నుంచి సుబ్బరాజు ఆధిక్యాన్ని కొనసాగించగా 8, 9, 17 రౌండ్లలో మాత్రం వైఎస్సార్ సీపీ అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ స్వల్ప ఆధిక్యతను కనబరిచారు. అయితే చివరి రౌండుకు వచ్చే సరికి దాట్ల సుబ్బరాజు తన సమీప ప్రత్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌పై 37,935 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. నియోజకవర్గంలో 2,05,163 ఓట్లు పోలవ్వగా టీడీపీ అభ్యర్థి దాట్ల సుబ్బరాజుకు 1,17,233 ఓట్లు, వైఎస్సార్ సీపీ అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు 79,298 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి పాలెపు ధర్మారావుకు 1330 ఓట్లు, నోటాకు 1857 ఓట్లు, ఇతరులకు 5,445 ఓట్లు వచ్చాయి.

## పుదుచ్చేరి పార్లమెంట్ స్థానం కాంగ్రెస్ కైవసం

**1,11,123 ఓట్ల మెజార్టీతో వైథిలింగం విజయం**



కౌంటింగ్ కేంద్రం వద్ద వైథిలింగంను సత్కరించిన డీఎంకే, కాంగ్రెస్ నేతలు

**యానాం:** పుదుచ్చేరి పార్లమెంటరీ నియోజవర్గ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ(ఇండియా కూటమి) కైవసం చేసుకుంది. ఇండియా కూటమి అభ్యర్థిగా బరిలో దిగిన సిటింగ్ ఎంపీ వి.వైథిలింగం తన సమీప ప్రత్యర్థి బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమి అభ్యర్థి నమశ్శివాయంపై 1,11,123 ఓట్ల మెజారీతో గెలుపొందారు. వైథిలింగంకు 3,67,633 ఓట్లు రాగా నమశ్శివాయంకు 2,56,510 ఓట్లు వచ్చాయి. పుదుచ్చేరి పార్లమెంటరీ స్థానానికి మొత్తంగా 26 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. అయితే యానాం అసెంబ్లీ నియోజకవర్గంలో మాత్రం బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమి అభ్యర్థి నమశ్శివాయంకు స్పష్టమైన ఆధిక్యం కనిపించింది. యానాం నియోజకవర్గంలో నమశ్శివాయంకు 22,127 ఓట్లు లభించగా, వైథిలింగంకు 6,947 ఓట్లు మాత్రమే వచ్చాయి. పుదుచ్చేరి లోక్‌సభ స్థాన పరిధిలోని మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో మాత్రం వైథిలింగం ఆధిక్యత చూపించడంతో విజయం ఆయననే వరించింది. ఈ ఎన్నికల్లో యానాంకు చెందిన ఇండిపెండెంట్ అభ్యర్థి పోషియ్యకు 1,074 ఓట్లు లభించాయి. పుదుచ్చేరిలో కాంగ్రెస్ అభ్యర్థి వి.వైథిలింగం విజయం సాధించడంపై స్థానిక యానాం కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌చార్జి మల్లాడి సత్తిబాబు, బీరాస్వామి, లంకే శ్రీనివాస్, అంజయ్య, సీహెచ్ చౌదరి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## దారుల వెంట విరుల పంట



భీమనపల్లిలో రోడ్డు చెంతన విరబూసిన తురాయి పూలు



కిత్తన చెరువులో ఆహ్లాదకరంగా కనిపిస్తున్న తురాయి చెట్లు

**ఉప్పలగుప్తం:** మండలంలోని పలు రహదారుల వెంట తురాయి చెట్ల పూలు చెట్టంతా వికసించి పరవశింపజేస్తున్నాయి. ఆకులు కనపడకుండా ఎర్రటి సింధూర వర్ణంతో చెట్టంతా పూలు విరబూసి వికసించడంతో ప్రయాణికులకు ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి. మండువేసవిలో భానుడి నుంచి రక్షిస్తూ ప్రయాణికులకు నీడనిచ్చి సేద తీరుస్తున్నాయి.

# వ్యవ'సాయానికి' ఉపాధితో ఊతం



అల్లవరం చెరువులో పూడిక తీస్తున్న ఉపాధి కూలీలు



వాసాలతిప్ప డ్రెయిన్‌లో పూడిక తొలగిస్తున్న కూలీలు

- ఉపాధి కూలీలకు రోజుకి రూ.300 వేతనం
- నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా

**అల్లవరం:** జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఊతం ఇచ్చేలా కొత్త ఆర్థిక సంవత్సరంలో శరవేగంగా పనులు చేపట్టింది. వ్యవసాయానికి అనుబంధంగా ఉపాధి పనులు నిర్వహించి తద్వారా ఉపాధి కూలీలకు 100 రోజుల పని కల్పించడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో ఉపాధి పనులను ముమ్మరంగా నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. పంట కాలువలు, డ్రెయిన్లలో పేరుకు పోయిన చెత్తా చెదారాన్ని తొలగించడం, పూడిక తీత పనులు, రైతులకు ఫారమ్ పాండ్స్ తవ్వకాలు, కొబ్బరి చెట్లకు పళ్లాలు ఏర్పాటు చేయడం, పుంత రోడ్ల అభివృద్ధి వంటి పనుల్లో ఉపాధి కల్పించనున్నారు. ఉపాధి కూలీలకు పని కల్పించడంతో పాటు ఆ పనులతో రైతులకు లాభదాయకంగా ఉండేలా ఉపాధి శాఖ జాగ్రత్తలు తీసుకుంటుంది.

ఉపాధి పనుల్లో పారదర్శకత, పనుల్లో నాణ్యత పెంచడానికి పని ప్రదేశంలో నేషనల్ మొబైల్ మోనిటరింగ్ సిస్టమ్ యాప్ ద్వారా పని స్వభావాన్ని ఫొటో తీసి అప్‌లోడ్ చేసేలా కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందించింది. కూలీలకు ఉపాధి కల్పించడమే కాకుండా, వారికి గరిష్టంగా రోజుకి రూ.300 వేతనం ఇస్తున్నారు. గతేడాది రూ.272 ఉన్న వేతనాన్ని మరో రూ.18 పెంచి గరిష్టంగా రూ.300గా నిర్ణయించారు. ఈ వేతనం ఏప్రిల్ 1 నుంచి అమలు చేస్తున్నారు. ఏప్రిల్ నెలలో చేసిన పనికి సంబంధించిన వేతనాలు ఇప్పటికే కూలీల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి వేతనం పెంపుపై ఉపాధి కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయానికి అనుబంధంగా చేస్తున్న ఫారమ్ పాండ్స్, కొబ్బరిచెట్లకు పళ్లాల ఏర్పాటు, వరి క్షేత్రాలకు పుష్కలంగా సాగునీరు వెళ్లేందుకు పంట బోదెల్లో పూడిక తీత, కాలువల్లో చెత్తా చెదారం తొలగింపు, రెవెన్యూ డ్రెయిన్‌లో పూడికతీత పనులతో ఉపాధి హామీ పథకంలో పనులు చేపట్టడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఏప్రిల్ నుంచి రోజుకు రూ.300 వేతనం**



వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేలా ఉపాధి హామీ పథకంలో ఇంటిల్లిపాదికి పని కల్పించి వేతనాలు అందిస్తున్నారు. ఏప్రిల్ నుంచి రోజుకి రూ.300 వేతనం ఇస్తున్నారు. ఉపాధి హామీ పథకంతో నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుంది. వేసవిలో పంటబోదెలు, కాలువ పనులు, పూడికతీత పనులు చేశాం.

– బుంగా బాలాస్వామి, డి.రావులపాలెం

**2.80 లక్షల పనిదినాల లక్ష్యం**

ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకూ 1.20 లక్షల పని దినాలు కల్పించాం. కొత్త ఆర్థిక సంవత్సరంలో 2.80 లక్షల పనిదినాలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న చెరువులు, పంట బోదెలు, కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాం. చేసిన పనులకు ఎప్పటికప్పుడు కూలీలకు వేతనాలు చెల్లిస్తున్నాం.

– విప్పర్తి శ్రీనుబాబు, ఏపీఓ, ఉపాధి హామీ పథకం, అల్లవరం

## వేసవి శిబిరాల నిర్వహణ అభినందనీయం

**రాజోలు:** చిన్నారుల కోసం తైక్వాండో, వెస్ట్రన్, క్లాసికల్ డ్యాన్స్ సమ్మర్ కోచింగ్ శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని ప్రముఖ పారిశ్రామిక వేత్త కేఎస్ఎన్ రాజు అన్నారు. తాటిపాకలో శ్రీరామ్ డ్యాన్స్ అకాడమీ మొదటి వార్షికోత్సవం పురస్కరించుకుని చిన్నారులు ప్రదర్శించిన తైక్వాండో, వెస్ట్రన్, కూచిపూడి నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రతిభ చూపిన చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. పాఠశాలలను తెరిచే వరకు చిన్నారులు ఆసక్తి చూపే రంగంపై వారికి శిక్షణ ఇస్తున్న డాన్స్ మాస్టర్లు ప్రసాద్, సాయికుమార్, తైక్వాండో కోచ్ మణికుమార్‌ను చిన్నారుల తల్లిదండ్రులు అభినందించారు.

## ఘనంగా రావులమ్మ అమ్మవారి తీర్థం



రావులమ్మ అమ్మవారు

**అంబాజీపేట:** కె.పెదపూడిలో వేంచేసిన రాజేశ్వరి రావులమ్మ అమ్మవారి తీర్థం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు అమ్మవారిని దర్శించుకుని చలివిడి పానకాలు, ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అమ్మవారి ఉయ్యాల సేవలో గ్రామ ఆడపడుచులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సోమవారం రాత్రి అమ్మవారి పూజ ఘటాలను పురవీధుల్లో ఊరేగిస్తూ జాతర నిర్వహించారు. జాతరలో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

# ఖరీఫ్ సాగుకు సమాయత్తం

- క్లస్టర్‌లో 28 వేల ఎకరాల్లో వరిసాగు
- అందుబాటులో 12.28 మెట్రిక్ టన్నుల ఎరువులు
- ఆర్బీకేల ద్వారా రైతన్నల చెంతకే విత్తనాల సరఫరా
- విరివిగా మట్టి నమూనాల సేకరణ



పెనికేరులో మినీ ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు

**ఆలమూరు:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక చర్యలతో అధిక దిగుబడులను సాధించడం ద్వారా రబీ సీజన్ ఆశాజనకంగా ముగిసింది. గత ఏడాది పంటకు సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీ రైతుల ఖాతాలో జమ చేసి ప్రభుత్వం రైతులకు అండగా నిలిచింది. గ్రామాల్లో నెలకొల్పిన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సరైన సమయానికి విత్తనాలు, ఎరువులు సరఫరా సక్రమంగా జరుగుతుంది. రైతులు తాము పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర లభ్యమవుతుంది. దీంతో రైతులు రెట్టించిన ఉత్సాహంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సమయాత్తమవుతున్నారు. నైరుతి రుతుపవనాలు పక్షం రోజులకు ముందే రావడంతో రైతులు ఖరీఫ్ పనుల్లో నిమగ్నమయ్యారు. ఖరీఫ్ సాగులో విత్తన దశ నుంచి కోత కోసి మాసూళ్లు జరిగి ఆర్బీకేలకు విక్రయించే వరకూ ప్రతి అంశంలోను రైతులకు చేదోడు వాదోడుగా ఉంటూ గిట్టుబాటు ధర సాధించేందుకు వ్యవసాయశాఖ పక్కా ప్రణాళికలను రూపొందించింది. అధిక దిగుబడులు సాధించే వీలుగా రైతులను ప్రోత్సహించే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లో ఉన్న 11 మండలాల్లో సుమారు 28 వేల ఎకరాల్లో వరిసాగు జరుగుతుంది. ఈ సాగులో 73 శాతం మేర స్వర్ణ రకం సాగు చేస్తుండగా ఎంటీయూ 1318 రకాన్ని 21 శాతం, ఎంటీయూ 1064 రకం ఆరు శాతం మంది సాగు చేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఈ ఖరీఫ్ సాగులో ఎనిమిది వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేయగా రైతుల నుంచి సుమారు మూడు వేల క్వింటాళ్ల సేకరణ ఇప్పటికే జరిగింది. అలాగే ప్రస్తుతం వివిధ గ్రామాల్లో 900 క్వింటాళ్ల విత్తనాలు ఆర్బీకేల్లో నిల్వచేయగా మిగిలిన విత్తనాలు ఈ నెలాఖరులోగా సరఫరా చేసేందుకు వ్యవసాయశాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. అలాగే ఖరీఫ్ సాగుకు సంబంధించి ఎరువులు ఇప్పటికే ఆర్బీకేలకు చేరాయి.

**ఖరీఫ్ సీజన్‌కు ముందు సాగునీటి సరఫరా**

జిల్లాలోని రైతులకు ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే సాగునీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు తీసుకుంది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురివడంతో పాటు జూన్ ఒకటి నుంచి ధవళేశ్వరం బ్యారేజీ నుంచి సెంట్రల్, తూర్పు,, పశ్చిమ డెల్టా కాలువలకు సాగునీరు అందిస్తున్నారు. అలాగే ఖరీఫ్ సాగు చేపట్టే ముందుగా రైతులందరూ మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవడం వ్యవసాయశాఖ తప్పనిసరి చేసింది. అందులో భాగంగా స్థానిక రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి రైతులు తమ పొలాల్లోని మట్టి నమూనాలను సేకరించి ఇస్తే సంబంధిత రైతులకు త్వరితగతిన ఫలితాలను అందజేస్తారు. దీంతో ఆ మట్టి నమూనాలో వచ్చే పరీక్షల ఆధారంగా ఎరువులు, పురుగు మందులను వినియోగించుకునే అవకాశం ఏర్పడుతుంది. తద్వారా నాణ్యమైన పంటలు పండించడంతో పాటు అధిక దిగుబడి, పెట్టుబడి ఆదా సమకూరే అవకాశం రైతులకు ఉంది.

### బాలలను అలరించిన ప్రదర్శనలు



విద్యార్థులకు సైన్స్ పరిజ్ఞానాన్ని వివరిస్తున్న ఉపాధ్యాయులు

**యానాం:** స్థానిక మెట్టకూరు మదర్‌థెరిస్సా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న వేసవి బాలల వినోద కేంద్రంలో జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక గేయాలను చిన్నారులు ఆలపించారు. అదేవిధంగా బోర్లించిన నీటి గ్లాసుకు కాగితం, జల్లెడ అతుక్కుని ఉండటం, కాగితం మీద రాతను ఎరుపుగా మార్చడం, పెన్సిల్‌తో బియ్యం గ్లాసును లేపడం తదితర ఇంద్రజాల ప్రదర్శనలు ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఆయా ప్రదర్శనల వెనుక ఉన్న సైన్స్ పరిజ్ఞానాన్ని విద్యార్థులకు వివరించారు. జనవిజ్ఞాన వేదిక మహిళా కార్యదర్శి కె.కరుణ కర్రసాము కళ గురించి వివరించి విద్యార్థుల ఎదుట ప్రదర్శించారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, టి.శ్రీనివాస్, ఎం.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలల్లో నిరుపయోగంగా కంప్యూటర్లు



అంబాజీపేటలో శిథిలమై మూలకు చేరిన కంప్యూటర్లు

**అంబాజీపేట:** శాస్త్ర సాంకేతిక ఉరకలు వేస్తున్న ప్రస్తుత తరుణంలో గ్రామీణ విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందకుండా పోతుంది. గత ఏడేళ్లుగా కంప్యూటర్ విద్య విద్యార్థులకు అందని ద్రాక్షగా మారింది. కంప్యూటర్ విద్య ఈ ఏడాదైనా ప్రారంభిస్తారని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆశగా ఎదురుచూస్తున్నారు. గ్రామీణ విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అందించాలన్న లక్ష్యంతో కోనసీమ జిల్లా వ్యాప్తంగా సుమారు 100 పాఠశాలల్లో సర్వశిక్షాభియాన్ నిధులతో ప్రారంభమైన కంప్యూటర్ బోధన అనంతరం 1000 పాఠశాలల్లోని విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందేది. అనంతరం నిట్ సంస్థతో 2007లో ఒప్పందం కుదుర్చుకున్న రాష్ట్ర ప్రభుత్వం 2008 విద్యా సంవత్సరం నుంచి పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గంలోని ఆయా మండలాల్లోని సుమారు 90 పాఠశాలల్లోని విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించే ఏర్పాటు చేశారు. దీని నిమిత్తం కాంట్రాక్ట్ పద్ధతిలో టీచర్లను నియమించి ఒక్కో టీచర్‌కు రూ.2,300ల చొప్పున జీతం ఇచ్చేవారు. అయితే కంప్యూటర్ ఉపాధ్యాయుల ఒప్పందం 2013తో ముగియడంతో విద్యార్థులకు నాటి నుంచి విద్య అందడం లేదు. కంప్యూటర్ల అనుమతి కాలం గడచిపోవడంతో ఆ సంస్థ వారు కంప్యూటర్లను మెయింటెనెన్స్ చేయకపోవడంతో అవి అలంకార ప్రాయంగా మారాయి. దీంతో కంప్యూటర్ విద్య కాస్తా అటకెక్కింది. లక్షలాది రూపాయలు వ్యయంతో పాఠశాలలకు అందజేసిన కంప్యూటర్‌లు ఎందుకూ పనికి రాకుండా పోవడంతో ఒక చోట భద్రపరిచారు. ఈ ఏడాది అయిన కంప్యూటర్ విద్యను అందుబాటులోకి తీసుకువచ్చి విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించాలని తల్లిదండ్రులు ఆశిస్తున్నారు.

### అభయాంజనేయునికి మామిడిపండ్లతో అర్చన



మామిడిపండ్లతో అభయాంజనేయునికి పూజలు

**మామిడికుదురు:** మామిడికుదురులో కొలువుదీరిన అభయాంజనేయస్వామికి మంగళవారం మామిడి పండ్లతో అర్చన చేశారు. వైశాఖ మాస ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. చెరకురసంతో పాటు పలు ద్రవ్యాలతో పూజలు జరిపించారు. అనంతరం మామిడిపండ్లను స్వామి వారికి సమర్పించి పూజలు నిర్వహించారు. ఈ పూజలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

**సార్వాకు సిద్ధం చేశాం**



సార్వా సాగును ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షించేదుకు అన్ని విధాలుగా సంరక్షణ చర్యలు చేపట్టాం. విత్తనాలు, ఎరువులు, సాగునీరు తదితర విభాగాలను సిద్ధం చేశాం. రైతులకు ఎల్లప్పుడు సూచనలు, సలహాలను అందించేందుకు ఆర్బీకేల సిబ్బంది తగిన శిక్షణను ఇప్పటికే అందించాం.

– కె.నాగేశ్వరరావు, ఏడీఏ, ఆలమూరు

**ఆర్‌బీకేలతో రైతులకు మేలు**



ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఎంతో మేలు చేస్తున్నాయి. విత్తనాల సరఫరా నుంచి రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించే వరకూ అండగా ఉంటుంది. గతంలో మాదిరిగా కాకుండా ఎరువులు గ్రామంలోనే లభిస్తున్నాయి. దీనివల్ల నాణ్యమైన పంటలు పండించగలుగుతున్నాం.

– బొర్రా నాగరాజు, సంధిపూడి